తప్పుచేసి
తప్పించుకోవడానికి,
ఉన్న తెలివితేటలలో
సగం ...
తప్పు చేయకుండా
ఉండటానికి
ఉపయోగిస్తే చాలా
జీవితాలు బాగుపడేవి
ఈ సమాజంలో..!!

# DD9 వార్త
తెలుగు దినపత్రిక

ఆ ఒక్కటీ చేసుంటే నెక్స్ట్ లెవల్!




సంపుటి : 02 సంచిక : 224 హైదరాబాద్, ఏప్రిల్, శనివారం 04, 2026 పేజీలు : 05 వెల : 3.00

## లంబాడీల భూములు లాక్కొని
# జైల్లో పెట్టారు

గిరిజనుల ఏ ఒక్క హామీ
కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు
డెడ్ స్టోరేజీకి చేరిన జూరాల ప్రాజెక్టు
కోయిల్ సాగర్
ఆయకట్టుకు నీటి కష్టాలు తీవ్రం
నారాయణపూర్ నుంచి
నీటి విడుదలకు ప్రభుత్వ ప్రయత్నాలు
కర్ణాటకతో చర్చలు..
5 టీఎంసీల కోసం విజ్ఞప్తి

హైదరాబాద్, (డిడి9 వార్త):
తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కేవలం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమైందని మాజీ మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లిలో బావోజీ మహారాజ్‌ను దర్శించుకున్న ఆయన, అనంతరం గిరిజన సోదరులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా ప్రస్తుత ప్రభుత్వం నెరవేర్చలేదని ..మిగతా 2లో





తెలంగాణ రైజింగ్ కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు కీలక భాగస్వాములుగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ వేదికగా జరిగిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. తెలంగాణను దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో కూడా పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలపడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ


రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం
పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం గమ్యస్థానం
భారతదేశానికి వస్త్ర రంగంలో గొప్ప చరిత్ర ఉంది
హ్యాండ్ లూమ్, టెక్స్ టైల్ రంగాలు ఆర్థిక వ్యవస్థకు పునాది
3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను తీసుకొస్తాం
ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ రంగంలో మనం టాప్
రాష్ట్రానికి గ్లోబల్ కనెక్టివిటిని తీసుకొస్తున్నాం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

హైదరాబాద్, (డిడి9 వార్త):
సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, భారతదేశానికి వస్త్ర రంగంలో గొప్ప చరిత్ర ఉందని, శతాబ్దాలుగా చేనేత, హ్యాండ్‌లూమ్, టెక్స్‌టైల్ రంగాలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేశాయని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం కూడా టెక్స్‌టైల్స్ రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అనేక టెక్స్‌టైల్ పార్కులు, పరిశ్రమలు ఏర్పడి ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు.

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వెల్లడించారు. ఈ లక్ష్య సాధనలో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు భాగస్వాములుగా ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీటి వనరులు, అనుమతులు వంటి అన్ని సౌకర్యాలను వేగంగా, పారదర్శకంగా అందిస్తున్నదని వివరించారు. 'సింగిల్ విండో' విధానంతో అనుమతుల ప్రక్రియను సులభతరం ..మిగతా 2లో

# రేవంత్ పోవాలి.. మార్పు రావాలి
## రేవంత్ రెడ్డి పాలనపై జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

రాష్ట్రంలో మార్పు అవసరం ఉందని వ్యాఖ్య
గతంలో "కేసీఆర్ పోవాలి"
నినాదంతో కాంగ్రెస్ విజయం
ఇప్పుడు అదే పరిస్థితి మళ్లీ ఏర్పడిందని వ్యాఖ్య
రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో అసంతృప్తి
రెండేళ్లలోనే ప్రభుత్వంపై
నమ్మకం తగ్గిందని ఆరోపణ
తనను అడ్డుకోవడానికి
నామినేటెడ్ పదవుల్లో జాప్యం



హైదరాబాద్, (డిడి9 వార్త):
'రెండేళ్ల పాలనలోనే సీఎం రేవంత్ రెడ్డి పోవాలి.. మార్పు రావాలి' అనే పరిస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో కూడా కేసీఆర్ పోయి మార్పు రావాలనే నినాదంతోనే ప్రజలు కాంగ్రెస్ కు ఓటేశారని స్పష్టం చేశారు. ఈ రెండేళ్ల కాలంలో రేవంత్ రెడ్డి పాలన పై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇటీవలే రాజీనామా చేసిన పెద్దాయన రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. శుక్రవారం జగిత్యాలలోని తన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇంతకాలం పార్టీలో ..మిగతా 2లో

# కేరళంలో రేవంత్ అబద్దాల ప్రచారం

ఆరు గ్యారెంటీలపై
అబద్ధాలతో మోసం
కెసిఆర్ లాగే అబద్దాల
ప్రచారం అందుకున్న రేవంత్
తెలంగాణలో అమలు
చేయని పథకాలను
ప్రచారం చేస్తారా
ఇది క్షమించరాని
మహాపరాధం...ప్రజలను
మోసం చేసే యత్నం
సిఎం రేవంత్ ప్రచారంపై
మండిపడ్డ కిషన్ రెడ్డి



హైదరాబాద్, (డిడి9 వార్త):
కేరళంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్దాల ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించారని, ఇది తెలంగాణ ప్రజలను మోసం చేయడమేనని రేవంత్ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో రేవంత్ ..మిగతా 2లో

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ..
## తల్లిదండ్రుల బాధలు పట్టవా?

ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై కవత తీవ్ర విమర్శలు
ఫీజులు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని ఆరోపణ
ఫీజు నియంత్రణ చట్టం అవసరం ఉందని డిమాండ్
ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శ
ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించాలి
ఫీజు నియంత్రణ చట్టం వెంటనే తీసుకురావాలి
ప్రభుత్వం స్పందించకపోతే పాఠశాలల
ముందు ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, (డిడి9 వార్త):
ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు దోపిడీపై ప్రభుత్వం నియంత్రణ చట్టం తీసుకురావాలని ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బిల్లు పాస్ చేయాలని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఒకేసారి 30 నుంచి 40 శాతం ఫీజులు పెంచి విద్యార్థుల ..మిగతా 2లో




# బియ్యం వ్యాపారులే.. రేషన్ డీలర్లు!
## కొణిజర్ల మండలంలో రేషన్ బియ్యం అక్రమాలు

రేషన్ డీలర్లు బియ్యం
వ్యాపారులుగా మారిన ఆరోపణలు
పేదలకు ఇవ్వాల్సిన బియ్యం పక్కదారి
అవసరం లేని కార్డుదారుల
నుంచి బియ్యం కొనుగోలు
కిలోకు రూ.15 చెల్లింపు
అదే బియ్యాన్ని బయట
మార్కెట్‌లో రూ.22కు విక్రయం
ప్రభుత్వ సంక్షేమ
పథకాల దుర్వినియోగం
పట్టుబడిన డీలర్లకే మళ్లీ షాపులు అప్పగింపు
చర్యలు లేకపోవడం
వల్ల అక్రమాలు కొనసాగింపు



03

# బిఆరఎస్‌లో ఇంటి గొడవలు

బిజెపిలో రాముడి రాజకీయం
ఈ రెండు పార్టీలకు
తెలంగాణలో కాలం చెల్లింది
ఇప్పటికిప్పుడు ఎన్నికలు
పెడితే వందసీట్లు సాధిస్తాం
టీపీసీసీ అధ్యక్షుడు
మహేశ్ కమార్ గౌడ్

03



# టౌన్‌ప్లానింగ్‌పై చర్యలు ఏవీ?




బడంగ్‌పేట్ సర్కిల్‌లో
అవినీతి ఆరోపణలు
ప్రజాధన దుర్వినియోగం
జరుగుతుందని ఆరోపణలు
డిప్యూటీ కమిషనర్‌తో
పాటు 9 మందిపై వేటు
పూర్తి స్థాయి విచారణ
జరపాలని డిమాండ్

హైదరాబాద్, (డిడి9 వార్త):
బడంగ్‌పేట్ సర్కిల్‌లో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, అధికారులు అవినీతికి పాల్పడ్డారని డిప్యూటీ కమిషనర్‌తో పాటు మరో 9 మంది పై జీహెచ్ఎంసీ కమిషనర్ వేటు వేశారు. కానీ మరో ముఖ్యమైన టౌన్ ప్లానింగ్ విభాగంలో అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను గుర్తించామని ఏసీబీ అధికారులు స్పష్టంగా చెప్పినా ఆ విభాగంపై ..మిగతా 2లో



# లంబాడీల భూములు లాక్కొని జైల్లో పెట్టారు

మొదటిపేజీ తరువాయి

ఆయన ఆరోపించారు.
దశాబ్దాల కాలంగా గిరిజనులు కలలుగన్న "మా తండాలో మా రాజ్యం" నినాదాన్ని నిజం చేసింది కేసీఆర్ మాత్రమేనని హరీష్ రావు గుర్తు చేశారు. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు పట్టించుకోని 3,100 గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత బీఆర్ఎస్‌దేనని ఆయన పేర్కొన్నారు. అలాగే, విద్య , ఉద్యోగాల్లో గిరిజనుల రిజర్వేషన్లను 6 శాతం నుండి 10 శాతానికి పెంచడం వల్ల నేడు వేలాది మంది గిరిజన బిడ్డలు డాక్టర్లు, ఇంజనీర్లుగా ఉన్నత పదవుల్లో స్థిరపడుతున్నారని ఆయన వివరించారు.
గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా రాష్ట్ర పండుగగా ప్రకటించి, నిధులు కేటాయించి ఊరూరా ఘనంగా నిర్వహించేలా చేసింది తమ ప్రభుత్వమేనని హరీష్ రావు గర్వంగా చెప్పారు. కొత్తపల్లి ప్రాంతంలో రూ. 8 కోట్లతో బ్రిడ్జిని నిర్మించడంతో పాటు, రూ. 50 లక్షలతో బంజారా భవనాన్ని, బావోజీ మహారాజ్ దేవాలయ అభివృద్ధికి రూ. 80 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు ఆయన గుర్తు చేశారు.
పోడు భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి కేసీఆర్ 6 లక్షల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా, వారికి రైతుబంధు, రైతుబీమా వంటి సౌకర్యాలను కల్పించారని హరీష్ రావు తెలిపారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో లంబాడాలకు కనీసం మంత్రి పదవి కూడా లేదని, గిరిజనులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధిని కాంగ్రెస్ గాలికొదిలేసిందని, ఇచ్చిన హామీలన్నీ బుట్టదాఖలు అయ్యాయని ఆయన మండిపడ్డారు.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీ..

మొదటిపేజీ తరువాయి

తల్లిదండ్రులను ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవాళ బంజారాహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఏటా 8 శాతానికి మించి ఫీజు పెంచటాన్ని ప్రభుత్వం నిరోధించాలన్నారు.

**పేద కుటుంబాలపై భారం:**

ఏప్రిల్ కూడా రాక ముందే ప్రైవేట్ స్కూల్స్ 25 నుంచి 30 శాతం ఫీజులు పెంచుతున్నాయని లక్షా రూపాయలు ఫీజు ఉంటే ఇప్పుడు మరో 30 వేలు భారం కాబోతోందన్నారు. ఈ విషయంలో హైదరాబాద్ లో చాలా స్కూల్స్ వద్ద పేరెంట్స్ ధర్నాలు చేస్తున్నారన్నారు. ప్రతి నెల ఫీజు తీసుకోవాల్సింది పోయి ఒకేసారి 60 శాతం ఫీజు కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారని దీని కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై భారీగా భారం పడే పరిస్థితి వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు నియంత్రణ చేయలేదంటూ ఇదే ముఖ్యమంత్రి గతంలో విమర్శించారని కానీ ఈ ప్రభుత్వం వచ్చి మూడేళ్లు గడుస్తోంది. ఇప్పటి వరకు ఒక్క చర్య కూడా తీసుకోలేదన్నారు. మొన్నటి బడ్జెట్ సమావేశాల్లో ఒకరిని ఒకరు తిట్టుకోవటానికే సరిపోయిందని ఈ ప్రభుత్వం వచ్చి మూడేళ్లైనా ఫీజు నియంత్రణ జరగకపోవటం సిగ్గుచేటని విమర్శించారు. స్కూల్స్ ముందు పేరెంట్స్ ధర్నా చేస్తున్న ఈ సమయంలోనైనా ప్రభుత్వంలో కదలిక రావాలన్నారు. అర్జెంట్‌గా స్పెషన్ అసెంబ్లీ సెషన్ నిర్వహించి ఫీజు నియంత్రణ కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. మొన్నటి విద్యా కమిషన్ రిపోర్ట్ చెత్తగా ఉన్నప్పటికీ అందులో ఏటా ఫీజును 7 నుంచి 8 శాతం పెంచుకోవచ్చని సూచించింది. కనీసం దాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు.

**ఫీజులు పెంచి జీతాలు పెంచడం లేదు:**

ప్రైవేట్ స్కూల్స్ ఫీజులు పెంచిన విధంగా పిల్లల తల్లిదండ్రులకు జీతాలు పెరగవని కవిత అన్నారు. ఫీజులు పెంచినప్పటికీ నారాయణ, చైతన్య లాంటి స్కూల్స్ లో టీచర్లకు జీతాలు పెండం లేదని కనీసం టీచర్లకు పీఎఫ్ కూడా ఇవ్వటం లేదన్నారు. ప్రైవేట్ టీచర్ల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని విమర్శించారు. ప్రైవేట్ స్కూల్స్ లో ఫుడ్ కూడా బాగుండటం లేదు. మేము డిమాండ్ చేస్తేనే ఫుడ్ సెక్యూరిటీ టాస్క్ ఫోర్స్ ను వేశారు. నారాయణ, చైతన్య వంటి స్కూల్స్ లో ఒకే దగ్గర పదివేల మందికి ఫుడ్ తయారు చేస్తున్నారు. కొంచెం ఫుడ్ పాయిజన్ అయిన సరే పదివేల మంది విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. అందువల్ల కార్పొరేట్ స్కూల్స్ లో ఫుడ్ శాంపిల్స్ ను చెక్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయా స్కూళ్లలో ఫీజులు ఎక్కువ, చదువు తక్కువ అన్నట్లుగా పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు

**ముఖ్యమంత్రే ఓపెనింగ్స్ కు వెళ్తున్నారు:**

ప్రైవేట్ ను నియంత్రించాల్సిన ముఖ్యమంత్రే పెద్ద పెద్ద కార్పొరేట్ హాస్పిటల్స్ ఓపెనింగ్ కు వెళ్తున్నారని ధ్వజమెత్తారు. అంటే ప్రైవేట్ దోపిడీని ఎంకరేజ్ చేస్తున్నట్లుగా ఆయనే సంకేతాలు ఇచ్చినట్లేనన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవటంతో కాలేజ్ యాజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదని హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ కూడా ప్రైవేట్ కాలేజ్ లు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాయన్నారు. కాలేజ్ యాజమాన్యాలు పిల్లల సర్టిఫికెట్స్ ను వెంటనే ఇవ్వాలని కోరుతున్నానని మీకు వచ్చే బకాయిలను మీ తరఫున పోరాటం చేసి ప్రభుత్వం ద్వారా ఇప్పిస్తామన్నారు.

**నార్త్ స్కూల్స్ లో మన వాళ్లకు ఉద్యోగాలేవి?**

కార్పొరేట్స్ స్కూల్స్ మాత్రమే కాకుండా నార్త్ నుంచి కూడా స్కూల్స్ వస్తున్నాయని అలెన్, ఎక్స్ లెన్స్, రెజిలెన్స్, ఫిజిక్స్ వాలా అంటూ నార్త్ స్కూల్స్ పెడుతూ వాటిల్లో ఉద్యోగాలు నార్త్ వాళ్లకే ఇస్తున్నారని కవిత ఆరోపించారు. తెలంగాణ వాళ్లకు ఉద్యోగాలు ఇవ్వని స్కూల్స్ కు ప్రభుత్వం పర్మిషన్లు ఇవ్వవద్దన్నారు. అవసరమైతే తెలంగాణ ఉద్యమకారులకు పర్మిషన్లు ఇవ్వండి. వాళ్లైనా బతుకుతారని సూచించారు. అన్ని ప్రైవేట్ స్కూల్స్ బాగాలేవని నేను అనటం లేదు. కొన్ని స్కూల్స్ పిల్లలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాయని చెప్పారు. పేరెంట్స్ కు అపాయింట్మెంట్ ఇవ్వకుండా వారిని పురుగుల్లా చూస్తున్న స్కూల్స్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణ, చైతన్య లాంటి స్కూల్స్ ఏటా 15 వందల కోట్ల వ్యాపారం చేస్తూ రకరకాల పేర్లతో ట్యాక్స్ కట్టకుండా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తున్నారని పైగా ధోభి, ఫుడ్, పుస్తకాలు ఇలా దేనికి కూడా మన వాళ్లకు అవకాశం ఇవ్వటం లేదన్నారు. నారాయణ, చైతన్య స్కూల్స్ వాళ్లకు ప్రత్యేకంగా ప్రింటింగ్ యూనిట్స్ ఉన్నాయి. ఈ విధానాన్ని బీఆర్ఎస్ ఎంకరేజ్ చేసిందని కాంగ్రెస్ కూడా అలానే చేస్తే వారికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రిగా ముఖ్యమంత్రే ఉండటం మన ఖర్మ అని విమర్శించారు. ఎన్నికల వరకు విద్యార్థుల అంశాన్ని రేవంత్ రెడ్డి వాడుకున్నారు. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతే కూడా కనీసం రివ్యూ చేయటం లేదని విమర్శించారు.


**బీఆర్ఎస్ లో నన్ను అక్కడికే పరిమితం చేశారు**

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు నన్ను నిజామాబాద్ వరకే పరిమితం చేశారని అయినప్పటికీ మన తెలంగాణ వాళ్లకు అన్యాయం జరగవద్దని నిజామాబాద్ జిల్లాకు నారాయణ, చైతన్య స్కూల్స్ ను రానివ్వలేదన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మా జిల్లాకు కూడా ఆ స్కూల్స్ వచ్చేశాయి. ప్రభుత్వ పరంగా ఈ అంశంపై కచ్చితంగా ఒక స్టాండ్ తీసుకోవాలన్నారు. స్కూల్స్ లో ఎంప్లాయిమెంట్ విషయంలో మన వాళ్లకు అవకాశం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ స్కూల్స్ లో వేలాది మంది చాలా తక్కువ జీతాలకు పనిచేస్తున్నారు. వారికి అన్యాయం జరగకుండా మేము పోరాటం చేస్తామని మేము డిమాండ్ చేసిన అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే జాగృతి పక్షాన అన్ని స్కూల్స్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు.

# దక్షిణాసియా టెక్స్‌టైల్ రాజధానిగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

చేసినట్లు తెలిపారు.
టెక్స్‌టైల్స్ రంగం కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా, లక్షలాది చేనేత కుటుంబాలకు జీవనాధారమని సీఎం స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నదని, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.
తెలంగాణను దక్షిణాసియాలో టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందని సీఎం తెలిపారు. దేశీయంగా మాత్రమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో కూడా తెలంగాణ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఏర్పడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆధునిక సాంకేతికత, నాణ్యత ప్రమాణాలు, ఎగుమతి అవకాశాలను పెంచడం ద్వారా ఈ రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు.
హైదరాబాద్ నగరం ఇప్పటికే ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిందని సీఎం పేర్కొన్నారు. అదే విధంగా టెక్స్‌టైల్స్ రంగంలో కూడా హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నగరంలోని మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు, గ్లోబల్ కనెక్టివిటీ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నాయని చెప్పారు.
చిత్ర పరిశ్రమపై కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించారు. హైదరాబాద్ ప్రపంచంలోనే ప్రముఖ ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా ఎదిగిందని, సినీ రంగానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. చిత్ర పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. సినిమా రంగం ద్వారా కూడా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు విశేషంగా తోడ్పాటు అందుతోందని అన్నారు.
పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్య అంశమని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల అభివృద్ధి పర్యావరణానికి హాని కలగకుండా ఉండేలా కఠిన నియమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రీన్ ఇండస్ట్రీస్‌ను ప్రోత్సహించడం, పర్యావరణ అనుకూల సాంకేతికతను ఉపయోగించడం ద్వారా స్థిరమైన



అభివృద్ధిని సాధించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.
ఈ కాన్ఫరెన్స్‌లో దేశ విదేశాల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, రంగ నిపుణులు పాల్గొన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై వారు ఆసక్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, పారదర్శక విధానాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతున్నాయని అభిప్రాయపడ్డారు.
మొత్తంగా తెలంగాణను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం పునరుద్ఘాటించారు. పారిశ్రామిక వృద్ధి, ఉపాధి కల్పన, పర్యావరణ పరిరక్షణ—ఈ మూడు అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలపాలన్నదే లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా ప్రతి రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని, అందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# టౌన్‌ప్లానింగ్‌పై చర్యలు ఏవీ?

మొదటిపేజీ తరువాయి




ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం బడంగ్‌పేట్ సర్కిల్లో సర్వత్ర చర్చ జరుగుతుంది. గత నెల బడంగ్‌పేట్ సర్కిల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులతో పాటు మరుసటి రోజు విజిలెన్స్ అధికారులు సైతం సోదాలు నిర్వహించి పలు కీలక ఫైళ్లను తీసుకెళ్లారు.
ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాలతో పాటు టౌన్‌ప్లానింగ్ వి భాగంలో అవినీతి ఆరోపణలు ఉన్నాయని, టౌ న్‌ప్లానింగ్ విభాగంలో 49 అక్రమ నిర్మాణాలు గుర్తించామని, 21 రోజులలోపు నోటీసులు జారీ చేయాలని ఆ నిర్మాణాలకు మొదటి, రెండవ నోటీసులు జారీ చేయలేదని పూర్తిస్థాయిలో పరిశీలించాక చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారి తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగం పై అనేక ఆరోపణలు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బుధవా రం సోషల్ మీడియా వేదికగా కొంతమంది డి ప్యూటీ కమిషనర్‌తో పాటు టౌన్‌ప్లానింగ్ అధికా రి సైతం సస్పెండ్ అయ్యాడని వైరల్ చేశారు.
ఏసీబీ సోదాల సమయంలో 49 అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అన్ని కోణా లలో రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పేదవాడు చిన్న గూడు నిర్మించుకుంటే ఆగమేఘాలలో ఆ భవనాల వద్దకు వెళ్లి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే టౌన్ ప్లా నింగ్ అధికారులు అవినీతిని గుర్తించామని ఏసీ బీ అధికారులు చెప్పినా టౌన్ ప్లానింగ్ పై ఎం దుకు చర్యలకు ప్రభుత్వం పూనుకోలేదని, ఏసీబీ అధికారులు స్వయంగా 49 నిర్మాణాలకు అనుమతులు లేకుండా నిర్మాణం జరిగిన నోటీసులు జారీ చేయలేదని చెప్పినా ఎందుకు ఉన్నత అధికారులు నిగ్గు తేల్చలేదని పలువురు గుసగుసలాడుతున్నారు.
గ్రామపంచాయతీ సమయంలో సర్పంచ్ సంతకంతో అనుమతులు ఉన్నాయని లేఔట్స్ ప్రకారం అక్రమ లేఔట్‌ను గుర్తించామన్నారు. ఏసీబీ అధికారులు సోదాలకు వచ్చిన సమయం లో టౌన్ ప్లానింగ్ అధికారి అక్కడి నుంచి తప్పించుకుపోయి ఫోన్ చేస్తే కూడా ఫోన్‌కు స్పందిం చడం లేదని, కమిషనర్‌కు చెప్పి అతని రప్పించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. సాయంత్రం సమయానికి ఆ అధికారి ఏసీబీ అధికారులకు కలిసి వాళ్లకి కావాల్సిన సమాచారాన్ని ఇచ్చాడని తెలిసింది. అవినీతి చేయని అధికారి అ యితే అధికారి ఆ సమయంలో అక్కడి నుంచి ఎందుకు తప్పించుకుపోయాడని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి సమకూర్చే టౌన్ ప్లానింగ్ విభాగం పై ఎందుకు చర్యలు తీసుకోలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

**9 మంది చైన్ మెన్‌లు గాయబ్..**

ఏసీబీ సోదాల సమయంలో 9 మంది చైన్‌మెన్‌లు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసి వారికి ఫోన్ చేసినా కలవలేదన్నారు. హాజరుకాలేదని, టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే సిబ్బందిపై కూడా శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేస్తామని ఏసీబీ అధికారులు మీడియాకు తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతిని గుర్తించి విజిలెన్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నత అధికారులు టౌన్ ప్లానింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# రేవంత్ పోవాలి..మార్పు రావాలి



మొదటిపేజీ తరువాయి

తన అడ్డు తొలగించుకునేందుకే నామినేటెడ్ పదవుల్లో జాప్యం చేశారని పేర్కొన్నారు.


**కాళేశ్వరం పునరుద్ధరణలో ప్రభుత్వ నిర్లక్ష్యం**

కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న విమర్శలు రాజకీయ కోణంలో మాత్రమే ఉన్నాయని.. కానీ పునరుద్ధరణ పై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. కేంద్ర మంత్రి సీ.ఆర్. పాటిల్ కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీలు మొత్తం ప్రాజెక్ట్‌లో చిన్న భాగమేనని తెలిపారు. ఈ మూడు బ్యారేజీలను పునరుద్ధరించడానికి సుమారు రూ.500 కోట్లలోపే ఖర్చవుతుందని, కానీ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదిక వచ్చినా అమలు చేయలేదని గుర్తు చేశారు. ప్రాణహిత నది జలాలను వినియోగించుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కనీసం సరైన డిజైన్ కూడా రూపొందించలేదని అన్నారు. బడ్జెట్‌లో కేవలం రూ.152 కోట్లు మాత్రమే కేటాయించడం నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. కడెం, ఎస్‌ఆర్‌ఎస్‌పీ ద్వారా 100 టీఎంసీల నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ తెలంగాణకు జీవనాధారమని, హైదరాబాద్ తాగునీరు, పారిశ్రామిక అవసరాలు, మూసి ప్రక్షాళన అన్నీ దీనిపైనే ఆధారపడుతున్నాయని చెప్పారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే దాదాపు 18 లక్షల ఎకరాల సాగు భూమి, హైదరాబాద్ అవసరాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోతే తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బ్యారేజీల పునరుద్ధరణను తక్షణమే చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని, లేకపోతే ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని తెలంగాణ సమాజం క్షమించదని జీవన్ రెడ్డి హెచ్చరించారు.
ప్రజా సేవ చేసే విషయంలో తప్పకుండా ఏదో ఒక పార్టీలో చేరాల్సిన ఆవశ్యకత ఉందన్న జీవన్ రెడ్డి భవిష్యత్ రాజకీయ నిర్ణయాలు అభిమానులు అనుచరుల అభిప్రాయం మేరకు తీసుకుంటానని అన్నారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సి ఉన్న మరో రెండు వారాల్లో తాను ఏ పార్టీలో చేరుతాననేది మీడియా ద్వారానే ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు పై విమర్శనాత్మక ధోరణిలో మాట్లాడిన జీవన్ రెడ్డి కేంద్రమంత్రి సీ.ఆర్. పాటిల్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కడిగేయడం చూస్తే ఆయన బీఆర్ఎస్ లో చేరడం ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

# కేరళంలో రేవంత్ అబద్ధాల ప్రచారం

మొదటిపేజీ తరువాయి

అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీలు తెలంగాణలో పూర్తిగా విఫలమయ్యాయని.. ఒక్క పథకం కూడా సమర్థవంతంగా అమలు కాలేదన్నారు. అమలు చేయని పథకాలను అమలు చేసినట్టు చెప్పడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని, కావాలంటే కేరళ ప్రజలు వచ్చి చూడాలని చెప్పడం విడ్డూరం ఉందని అన్నారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి యీడియాతో మాట్లాడారు. ఇది సాధారణ అబద్ధం కాదని.. ప్రజలను మోసం చేసే ప్రయత్నమని కిషన్ రెడ్డి ఆగ్రహించారు. సీఎం రేవంత్ రెడ్డివి మోసం చేసే రాజకీయాలు. గతంలో కేసీఆర్ ఎలా హామీలు ఇచ్చి అమలు చేయలేదో, ఇప్పుడు రేవంత్ రెడ్డి కూడా అదే మార్గంలో నడుస్తున్నారు. అమలు చేయకపోయినా 'చేశామని అనుకోండి' అనే ధోరణి ప్రమాదకరం అని హెచ్చరించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పారు, ఇచ్చారా?. పెన్షన్లు రూ.2,000 నుంచి రూ.4,000 చేస్తామని, దివ్యాంగులకు రూ.3,000 నుంచి రూ.6,000 చేస్తామని చెప్పారు, అమలు చేశారా?. దళిత కుటుంబాలకు రూ.12 లక్షలు ఇస్తామని హామీఇచ్చారు.. ఇచ్చారా?. బీసీలకు రూ.లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పారు.. రెండు సంవత్సరాల పాలనలో ఒక్క ఏడాది కూడా రూ.20 వేల కోట్లు ఇవ్వలేకపోయారు. ఇవన్నీ కేరళ ప్రజలకు చెప్పగలరా?. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకపోవడం మోసమైతే.. అమలు చేశామని చెప్పడం మరింత పెద్ద మోసం. తప్పుడు ప్రచారం, అబద్ధాలు చెప్పడం ప్రజలను దగా చేయడమేని అన్నారు. తెలంగాణలో పెళ్లయిన ఆడబిడ్డలకు తులం బంగారం ఎక్కడ?. ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్లు ఎక్కడ?. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఎక్కడ?. నిరుద్యోగ భృతి ఎక్కడ?. ఈ హామీలన్నీ ఎక్కడికి పోయాయి?. ఇవన్నీ చేయకపోయినా.. గ్యారెంటీలు అమలు చేశామని కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పడం ఎంత పెద్ద మోసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మాటలను నమ్మకండి. ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు కేరళం ప్రజలను మోసం చేశాయి. గత 10 సంవత్సరాలుగా అభివృద్ధిని అడ్డుకున్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ వస్తే అవినీతి మరింత పెరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి మాటలకు కేరళంలో విలువ లేదు. ఆయన ఎందుకు అక్కడికి వెళ్లారో అందరికీ తెలుసు. తెలంగాణ నుంచి డబ్బులు పంపుతున్నారనే అనుమానాలు ప్రజల నుంచి వస్తున్నాయి. అందుకే ఆ పార్టీ నాయకులను అక్కడికి పిలుస్తున్నారు. ఉపన్యాసాలు ఇవ్వమని పిలుస్తున్నారు కానీ ఓట్లు మాత్రం పడవని అందరికీ తెలుసున్నారు. 2014కి ముందు బీఆరఎస్ మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం ముంపు ప్రాంతాలను అన్యాయంగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిందని పేర్కొన్నారు. విభజన చట్టంలో ఉన్న అంశాలు కాంగ్రెస్, యూపీఏ ప్రభుత్వ నిర్ణయాల వల్లే జరిగాయి. దీనికి బీజేపీ లేదా కేంద్ర ప్రభుత్వానికి సంబంధం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్ విషయంలో మేము పూర్తిస్థాయి దర్యాప్తు కోరుతున్నాం. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఒక మేడిగడ్డ లేదా కొన్ని పిల్లర్ల విషయంపై మాత్రమే మాట్లాడుతున్నారు. ప్రాజెక్టు మొత్తంగా సీబీఐ విచారణకు ఇవ్వాలి. ప్రస్తుతం ఈ అంశం హైకోర్టులో ఉంది. పూర్తి నిజాలు బయటకు రావాల్సి ఉందన్నారు. గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అనేక ఆరో



పణలు చేసింది. బీఆరఎస్ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాల కేసుల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, కేసీఆర్ కుటుంబంపై కేసులు పెడతామన్నారు. జైలుకు పంపుతామని, రూ.లక్ష కోట్లు వసూలు చేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకూ ఒక్క కేసులోనూ చర్యలు తీసుకోలేదు. మరి ఆ ఆరోపణలు ఏమయ్యాయి?, దర్యాప్తు ఎక్కడికి పోయింది?. ఇప్పుడు తమ అసమర్థతను దాచుకోవడానికి బీజేపీపై నెపం వేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీగా బాధ్యత కాంగ్రెస్‌దే. వేరే వాళ్లపై నెట్టడం కాదు, తెలంగాణ ప్రజలకు హామీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ.. అమలు చేయాల్సిన ప్రజాస్వామ్య బాధ్యతా ఆ ప్రభుత్వానిదే' అని కిషన్ రెడ్డి తెలిపారు.



# బిఆరఎస్‌లో ఇంటి గొడవలు

- **బిజెపిలో రాముడి రాజకీయం**
- **ఈ రెండు పార్టీలకు తెలంగాణలో కాలం చెల్లింది**
- **ఇప్పటికిప్పుడు ఎన్నికలు పెడితే వందసీట్లు సాధిస్తాం**
- **టీపీసీసీ అధ్యక్షుడు మహేశ కమార్ గౌడ్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాజకీయాలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీఆరఎస్ ఉనికి కోల్పోయిందని, బీజేపీకి రాష్ట్రంలో స్థానం లేదని ఆయన అన్నారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో కాంగ్రెస్ నేతలతో భేటీ అయిన ఆయన.. ఈ మేరకు ప్రతిపక్షాల పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని రకాల కుట్రలు పన్నినా.. కాంగ్రెస్‌పై ప్రజలకు ఎంతో నమ్మకం ఉంది. అందుకు ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. బీఆరఎస్ పార్టీలో కొంత కాలంగా అంతర్గత కలహాలు కొనసాగుతున్నాయి. కేసీఆర్ కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరుకున్నాయి. కవిత వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆరఎస్ పరిస్థితి రోడ్డున పడిందన్నారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై.. కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఆయన అసెంబ్లీకి కూడా రావడం లేదు. ఇలాంటి పరిస్థితిలో బిఆరఎస్ రోజురోజుకు దిగజారుతోందని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ.. దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడుగుతోంది. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు.. అందుకే ఆ పార్టీని దూరం పెడుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో 100 సీట్లు ఖాయం' అని అన్నారు. బీజేపీ కులం, మతం పేరుతో రాజకీయాం చేస్తోందని..ఆ పార్టీకి తెలంగాణలో స్థానం లేదని విమర్శించారు. రాముడేమైనా బీజేపీ జాగీరా....వాళ్ల పార్టీల సభ్యత్వం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడా లేనట్టుగా తెలంగాణలో ప్రభుత్వ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. సన్నబియ్యం పథకం దేశంలోనే చారిత్రాత్మకమన్నారు. బీఆరఎస్ చేసిన అప్పులు కాంగ్రెస్ కడుతోందన్నారు. బీఆరఎస్ హయాంలో నేతల జేబుల్లోకి డబ్బులు వెళ్లాయన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు స్కీం సక్సెస్ గా నడుస్తోందన్నారు. బీజేపీ రాష్టాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదన్నారు. కేంద్రం లాభాల్లో ఉన్న సంస్థలను అమ్మేస్తోందని విమర్శించారు. 12 ఏండ్లలో కేంద్రం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు మహేశ్ కుమార్ గౌడ్. ఇందిగాంధీ నుంచి రాహుల్ వరకు పేదల కోసం పనిచేస్తున్నారని అన్నారు. బీఆరఎస్ చీప్ కేసీఆర్ ఫామ్ హౌస్ కే పరిమితమయ్యారని అన్నారు. దోచుకున్న సొత్తులో వాటాల గొడవలతో ఆ పార్టీ రోడ్డున పడిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ కు 100 సీట్లు గ్యారంటీ అని ధీమా వ్యక్తం చేశారు. గ్లోబల్ సమ్మిట్ తో 5 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయన్నారు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని చెప్పారు మహేశ్ కుమార్ గౌడ్. ఈ కర్యాక్రమంలో మంత్రి వివేక్‌తో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.



# పెగడాపల్లిలో హోరాహోరీగా కుస్తీ పోటీలు

- **మల్లయోధుల విన్యాసాలతో సందడిగా ఎల్లమ్మ జాతర**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 03 ఏప్రిల్ (డీడీ9 వార్త):**

బోధన్ మండలం పెగడాపల్లి గ్రామంలో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. జాతరను పురస్కరించుకుని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు గ్రామస్థులను, క్రీడాభిమానులను అలరించాయి. శుక్రవారం గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పోటీలను ప్రారంభించారు. పోటీల్లో భాగంగా పురుషునితో మహిళా మల్లయోధురాలు తలపడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పట్టు విడువకుండా వారు ప్రదర్శించిన ప్రతిభ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన కుస్తీ ప్రేమికులు ఈ పోటీలను ఆసక్తిగా వీక్షించారు. హోరాహోరీగా సాగిన తుది పోరులో విజేతగా నిలిచిన మల్లయోధుడికి నిర్వాహకులు రూ. 5 వేల నగదు బహుమతిని అందజేశారు. అంతకుముందు భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడంతో ఆలయ ప్రాంగణం భక్తజనసందోహంగా మారింది. ఈ కార్యక్రమంలో వీడీసీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బియ్యం వ్యాపారులే.. రేషన్ డీలర్లు!

## కొణిజర్ల మండలంలో రేషన్ బియ్యం అక్రమాలు

- **రేషన్ డీలర్లు బియ్యం వ్యాపారులుగా మారిన ఆరోపణలు**
- **పేదలకు ఇవ్వాల్సిన బియ్యం పక్కదారి**
- **అవసరం లేని కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు**
- **కిలోకు రూ.15 చెల్లింపు**
- **అదే బియ్యాన్ని బయట మార్కెట్‌లో రూ.22కు విక్రయం**
- **ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగం**
- **పట్టుబడిన డీలర్లకే మళ్లీ షాపులు అప్పగింపు**
- **చర్యలు లేకపోవడం వల్ల అక్రమాలు కొనసాగింపు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కొణిజర్ల మండల పరిధిలోని కొందరు రేషన్ డీలర్లే బియ్యం వ్యాపారుల అవతారమెత్తి పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. పలు గ్రామాల్లో కొంతమందికి బియ్యం అవసరం లేకపోవడంతో తీసుకోవడం లేదు. ఇదే అదునుగా భావించిన కొందరు డీలర్లు బియ్యం అవసరం లేని కార్డుదారులకు రూ.15 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యాన్ని బయటి వ్యాపారులకు రూ.22లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొణిజర్ల మండలంలోని వివిధ రేషన్ షాపుల డీలర్లపై గతంలో పదుల సంఖ్యలో 6(ఏ) కేసులు నమోదైనా ఒక్కటి నిరూపణ కాకపోవటంతో మళ్లీ పట్టుబడిన డీలర్లకే షాపులు అప్పగిస్తున్నారు. ఫలితంగా వారు యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పక్కదారి పడుతోంది. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఎంతో ఆర్థిక వ్యయాన్ని భరిస్తూ అందజేస్తున్న సన్న బియ్యం పక్కదారి పడుతున్న అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. దొడ్డు బియ్యం మొదలు సన్న బియ్యం వరకు యథావిధిగా అక్రమాలు జరుగుతూనే ఉన్నాయి. ఒకవేళ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ ప్రతిసారి వ్యాపారులు, డీలర్లపైన 6(ఏ) కింద కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

కొణిజర్ల మండలంలోని వివిధ రేషన్ షాపుల డీలర్లపై గతంలో పదుల సంఖ్యలో 6(ఏ) నమోదైనా ఒక్కటి నిరూపణ కాకపోవటంతో మళ్లీ పట్టుబడిన డీలర్లకే షాపులను అప్పగిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకున్న సమయంలో అధికారులు నిర్వహించే పంచనామా లోపభూయిష్టంగా ఉండటంతో కేసులు వీగిపోతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు ఫిర్యాదు చేస్తేనే తప్ప అధికారులు షాపులను తనిఖీ చేసే పరిస్థితి లేదనే విమర్శలు వస్తున్నాయి. షాపులను నిరంతరం తనిఖీ చేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు చుట్టపు చూపుగా ఇలా వచ్చి.. అలా వెళుతుంటారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.



తెల్లరంగు రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతినెలా ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్న బియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుంది. అధికారులు, డీలర్ల అవినీతి కారణంగా ఈ పథకం అభాసుపాలవుతోంది. ప్రభుత్వం గతంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినప్పుడు బయట నుంచి వ్యాపారులు వచ్చి రేషన్ వినియోగదారుల వద్ద కేజీ రూ.5లకు కొనుగోలు చేసేవారు. గత ఏడాదిగా ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుడంతో వ్యాపార పంథా మారింది. ఏకంగా డీలర్లే బియ్యం వ్యాపారుల అవతారం ఎత్తి కార్డుదారుల వద్ద బియ్యం కొనుగోలు చేస్తుండటం విశేషం.

గ్రామాల్లో కొంతమందికి బియ్యం అవసరం లేకపోవడంతో తీసుకోవడం లేదు. ఇదే అదునుగా భావించిన డీలర్లు బియ్యం అవసరం లేని కార్డుదారులకు రూ.15ల చొప్పున నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యాన్ని బయటి వ్యాపారులకు రూ.22లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనేది బహిరంగ రహస్యమే. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో డీలర్లు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులకు నెల నెల మామూళ్లు ముడుతున్నాయని, అక్రమాల గురించి తెలిసినా పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**మరింత నిఘా పెంచుతాం: తహసీల్దార్ అరుణ**

రేషన్ డీలర్లే.. వినియోగదారుల నుంచి బియ్యం కొంటున్నారనే ఆరోపణలపై సివిల్ సప్లై అధికారులు నిరంతరం షాపులను తనిఖీ చేస్తున్నారని తహసీల్దార్ అరుణ అన్నారు. అవసరమైతే మరింత నిఘా పెంచి అక్రమాలను అడ్డుకుంటామని ఆమె తెలిపారు.



# పదవి విరమణ పొందిన ఆర్మీ జవాన్ కు ఘన సన్మానం

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 03(డి డి 9వార్త ):-**

బోథ్ మండలం కౌట బి గ్రామానికి చెందిన ఓరుగంటి సురేష్ గత 17 సంవత్సరాలు దేశ సేవ చేసి పదవి విరమణ పొంది స్వగ్రామానికి చేరుకున్నారు. ఈయన తన విధి నిర్వహణలో భాగంగా జమ్ము కాశ్మీర్, బెంగుళూరు, సిక్కింలతో పాటు ఐక్యరాజ్యసమితి తరుపున కాంగో దేశంలో సైతం విధులు నిర్వర్తించారు. కాగా పదవి విరమణ పొంది స్వగ్రామానికి చేరుకున్న ఆయనకు గ్రామస్థులు, స్నేహితులు, సైన్యంలో పనిచేసి పదవి విరమణ పొందిన వారు, ప్రస్తుతం సైన్యంలో, పోలీస్ శాఖ లో కొనసాగుతున్న గ్రామ యువత పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ దేశానికి సేవే చేసే అవకాశం నాకు దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. పుట్టిన ఊరుకు, గ్రామస్తులకు తాను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటానని



అన్నారు. గ్రామంలో యువత అధిక సంఖ్యలో దేశ సేవ కు సన్నాద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓరుగంటి స్వామి, ఉప సర్పంచ్ ఇట్టేడి రమణ రెడ్డి, విడిసి అధ్యక్షుడు పిడుగు అశోక్ రెడ్డి, విడిసి మాజీ అధ్యక్షుడు బి. శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు వినాయక్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

### తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడైన

# దొడ్డి కొమురయ్య జయంతి

- **కోడిచెర్ల గ్రామంలో జయంతి వేడుకలు**

**నిజామాబాద్ పోతంగల్ ఏప్రిల్ 03 (డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని కోడిచర్ల గ్రామంలో తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డు కొమురయ్య జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది. గ్రామ బిర్ దేవ్ కురమ సంఘం అధ్యక్షులు బిర్లా వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు..నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా గర్జించిన ధీశాలి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు, అలుపెరగని వీరయోధుడు శ్రీ దొడ్డి కొమరయ్య గారి జయంతి సందర్భంగా వారికి మా ఘన నివాళులు.భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆయన చేసిన మహోన్నత ప్రాణత్యాగం తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం తన ప్రాణాలను అర్పించిన ఆ మహావీరుని పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ సదా ఆదర్శనీయం! ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మొండె కవిత ఈర్వంత్ ఉప సర్పంచ్ కోటగిరి గంగారం బిర్ దేవు కురుమ సంఘం కోడిచర్ల అధ్యక్షులు బిర్లా వేంకటేష్ ఉపాధక్షులు నగేష్ మల్లేష్.మాజి ఎంపిటిసి బిర్లా కేశవరావు. పర్స నగేష్ బిర్ల సాయిలు దండే సాయిలు కె.గంగారాం విరేశం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మంత్రి వర్యులకు ఘన స్వాగతం పలికిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 03(డి డి 9వార్త ):-**

ఈ నెల 6 న ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా నిర్వహించనున్న గౌరవ ముఖ్య మంత్రి & ఉప ముఖ్య మంత్రి వర్యుల భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి వచ్చిన ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి గౌ శ్రీ జూపల్లి కృష్ణా రావు గారు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గౌ శ్రీ గడ్డం వివేక్ గారు,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహా దారులు గౌ శ్రీ సుదర్శన్ రెడ్డి గారు, మంచిర్యాల ఎమ్మెల్యే గౌ శ్రీ ప్రేమ్ సాగర్ రావు గార్లను హెలిపాడ్ వద్ద స్వాగతం పలికిన బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ గారు.. అనంతరం సభ ఏర్పాట్లను పరిశీలించారు..ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..







# పిప్పిరి సభను విజయ వంతం చేయాలి

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 03(డి డి 9వార్త ):-**



ఈనెల 6 న గౌరవ ముఖ్యమంత్రి వర్యులు & ఉప ముఖ్య మంత్రి వర్యుల పర్యటన సభ స్థలం ఏర్పాట్ల పర్యవేక్షణ కు విచ్చేసిన రాష్ట్ర మంత్రి వర్యులు ఆదిలాబాద్ జిల్లా, బోథ్ ఏప్రిల్ 03(డి డి 9వార్త ): ఈ నెల 6 న ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షించిన ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి గౌ శ్రీ జూపల్లి కృష్ణా రావు గారు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గౌ శ్రీ గడ్డం వివేక్ గారు,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహా దారులు గౌ శ్రీ సుదర్శన్ రెడ్డి గారు, మంచిర్యాల ఎమ్మెల్యే గౌ శ్రీ ప్రేమ్ సాగర్ రావు గారు, ఉర్దూ అకాడమీ చైర్మన్ గౌ శ్రీ తాహెర్ బిన్ హందాన్ గారు. **ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గతం లో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఆదిలాబాద్ జిల్లా ను దత్తత తీసుకుంటానని అన్నారని ఇచ్చిన మాట ప్రకారం ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి ప్రత్యేక ద్రుష్టి సారిస్తూ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని, ఆదిలాబాద్ జిల్లాను ఆదర్శ జిల్లాగా మార్చే విధంగా కృషి చేస్తున్నారని అన్నారు,పిప్పిరి సభలో బోథ్ నియోజకవర్గానికి సంబదించిన పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్,బుగ్గారం లిఫ్ట్ ఇరిగేషన్ , తేజాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ,సుంకిడి లిఫ్ట్ ఇరిగేషన్,బోథ్ నియోజకవర్గం లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల,పొచ్చేరా ఐటీఐ కళాశాల తో పాటు అలాగే బాసర సరస్వతి దేవాలయ అభివృద్ధికి రూ.300 కోట్లు, 2027 గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లతో కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. అనేక అభివృద్ధి కార్యక్రమలకు శంఖు స్థాపన చేయ బోతున్నారని, కావున ఆదిలాబాద్ జిల్లా నలు మూలల నుండి ప్రజలు ఈ సభ కు తరలి వచ్చి సభను విజయ వంతం చెయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో వారి తోపాటు , జిల్లా క కాంగ్రెస్ నాయకులు కార్య కర్తలు పాల్గొన్నారు.



## ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ గృహప్రవేశం కు హాజరైన జిల్లా కలెక్టర్.

**బజార్ హత్నూర్,ఏప్రిల్ 03 (డిడి 9వార్త న్యూస్ ) :-**

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్శి షా తాను ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంకు హాజరు అయినారు. ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం రాంనగర్ గ్రామ ముకు చెందిన వికలాంగురాలు సుభద్రబాయి కి ఒక ఇల్లు మంజూరు కలెక్టర్ గతం లో వికలాంగుల కోట కింద ఇచ్చారు. ఆ ఇల్లు నిర్మాణం దశలో ఉన్నప్పుడు జిల్లా కలెక్టర్ బజార్ హత్నూర్ మండలంలోని పాఠశాల ఆవరణలో ఒక ప్రభుత్వ కార్యక్రమంలో రెవిన్యూ సదస్సు లో భాగంగా హాజరు అయిన సందర్భంగా సుభద్ర బాయి ఆ సభకు వచ్చి ఆమె ఒక మంచి గానం వినిపించారు. ఆ సమయంలో కలెక్టర్ సుభద్రబాయికి సంబందించిన యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. అప్పుడు ఆమె తన ఇంటి నిర్మాణం పూర్తి అవగానే నా ఇంటి గృహప్రవేశం కోసం తమరు రావాలని ఆమె కలెక్టర్ రాజర్శి షా కోరగా తప్పకుండా వస్తానని ఆమెకు ఆరోజు మాట ఇచ్చారు. ఆ మాట ప్రకారం శుక్రవారం రోజు ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ సుభద్రబాయి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం కు హాజరుఅయ్యారు. సీఎం సభ ఏర్పాట్లు పనులు ఉన్నప్పటికిని ఆ పని పూర్తి చేసుకొని రామనగర్ వచ్చి గృహప్రవేశం చేయించి సుభద్ర బాయికి బహుమతి ఇచ్చి శాలువాతో సత్కారం చేశారు. కలెక్టర్ తో పాటుగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్, హౌసింగ్ ఏ ఈ, తహసీల్దార్ శ్యామ్ సుందర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఆర్ ఐ నూర్ సింగ్, జి పి ఓ మహేందర్, రెవిన్యూ అధికారులు, ఎక్స్ ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్ర మంత్రి వర్యులకు ఘన స్వాగతం పలికిన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్

**బజార్ హత్నూర్, ఏప్రిల్ 03 (డిడి 9వార్త న్యూస్ ):-**

ఈ నెల 6 న ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలం పిప్పిరి గ్రామం వద్ద ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా నిర్వహించనున్న రాష్ట్ర ముఖ్య మంత్రి & ఉప ముఖ్య మంత్రుల భారీ బహిరంగ సభ ఏర్పాట్లను పర్యవేక్షించడానికి వచ్చిన ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణా రావు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్,రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య సలహా దారులు సుదర్శన్ రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు లను హెలిపాడ్ వద్దకు బోథ్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ వెళ్లి ఘనంగా స్వాగతంపలికారు. అనంతరం సభ ఏర్పాట్లను పరిశీలించారు..ఈకార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..







## ఘనంగా మున్నూరు కాపు అధ్యక్షుని జన్మదిన వేడుకలు.

**బజార్ హత్నూర్ , ఏప్రిల్ 03 (డి డి 9వార్త న్యూస్ ):-**

ఆదిలాబాద్ జిల్లా బజార్హత్నూర్ మండల కేంద్రమున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఎర్రనోళ్ల నాగభూషణ్ జన్మదిన వేడుకలు శుక్రవారం రోజు ఆయన స్వగృహంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా స్నేహితులు, బంధువులు, మిత్రులు అందరు కల్సి ఆయన స్వగృహంలో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో బోథ్ మండలం మర్ల పెల్లి సర్పంచ్, ఉప సర్పంచ్ పలువురు నాయకులు ఆయనకు ప్రత్యేకంగా పూల దండ వేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.




## ఆడబిడ్డ పెళ్లికి కల్లెంల జగపతి భరోసా

- **'తల్లి దీవెన' పథకం కింద రూ.41 వేల ఆర్థిక సాయం.**

**మొయినాబాద్, ఏప్రిల్ 03(డి డి 9వార్త):**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ అప్పోజిగూడ 19వ వార్డు కౌన్సిలర్ కల్లెంల జగపతి ఉదారత చాటుకున్నారు. వార్డులోని ప్రతి ఆడబిడ్డ వివాహానికి తన వంతుగా అందజేస్తామన్న 'తల్లి దీవెన' పథకంలో భాగంగా ఆర్థిక సాయాన్ని అందజేశారు. గ్రామ నివాసి వజ్రలింగంహేమలత దంపతుల కుమార్తె సింధుజ వివాహం సందర్భంగా రూ.41,000 చెక్కును వారికి అందజేసి వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల పెళ్లికి అన్నగా అండగా ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌కు బిగ్ షాక్.. ఈ నెల 13న బీఆర్ఎస్‌లో చేరనున్న జీవన్ రెడ్డి

**బజార్ హత్నూర్, ఏప్రిల్ 03:(డి డి 9వార్త న్యూస్ ):**

ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో పెను మార్పు చోటుచేసుకోబోతోంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి రాజకీయ భవిష్యత్తుపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి తెరపడింది.ఆయన అధికారికంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 13వ తేదీన జీవన్ రెడ్డి తన అనుచరులతో కలిసి గులాబీ కండువా కప్పుకోనున్నారు.ఈ రాజకీయ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. పార్టీ మార్పు ప్రక్రియలో భాగంగా ఈ నెల 7వ తేదీన కీలక పరిణామం చోటుచేసుకోనుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా జీవన్ రెడ్డి నివాసానికి వెళ్తారు. పార్టీలోకి రావాలని ఆయనను సాదరంగా ఆహ్వానిస్తారు. కేటీఆర్ పర్యటనతో జగిత్యాల నియోజకవర్గంలో రాజకీయ సందడి మొదలుకానుంది. జీవన్ రెడ్డి చేరికతో జగిత్యాల కోటలో బీఆర్ఎస్ బలం రెట్టింపు అవుతుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఆయన వంటి అనుభవజ్ఞుడైన నాయకుడు రావడం వల్ల ఉమ్మడి జిల్లాలో పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లవుతుందని గులాబీ నేతలు లెక్కలు వేస్తున్నారు. కేవలం చేరికతోనే ఆగకుండా.. జీవన్ రెడ్డికి ఘనస్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ అపూర్వ ఘట్టం ముగిసిన వెంటనే జగిత్యాలలోనే పార్టీ ప్లీనరీ నిర్వహించాలని బీఆర్ఎస్ అధిష్టానం ఆలోచిస్తోంది. ప్లీనరీ ద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపడమే కాకుండా ప్రతిపక్షాలకు గట్టి హెచ్చరిక పంపాలని గులాబీ బాస్ భావిస్తున్నారు. జగిత్యాల వేదికగా జరిగే ఈ భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొని భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును మరింత సుస్థిరం చేసుకోవాలని చూస్తోంది. కాంగ్రెస్‌లో దశాబ్దాల కాలం పనిచేసిన జీవన్ రెడ్డి నిర్ణయం ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బగా విశ్లేషకులు భావిస్తున్నారు.



# కొత్త సినిమా ప్రకటించిన సాయిదుర్గా తేజ్

వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతున్నారు సాయి దుర్గా తేజ్. తాజాగా ఆయన ఒక కొత్త మూవీని ప్రకటించారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న సుజీత్ , సందీప్‌ల దర్శకత్వంలో సాయిదుర్గా తేజ్ హీరోగా ఈ చిత్రం రానుంది. 'ఎస్‌డీటీ 19' వర్కింగ్ టైటిల్‌తో దీన్ని నేడు అధికారికంగా ప్రకటించారు. 'యుగాలుగా బయటకు రాని రహస్యాలు, ఊహకు అందని శక్తులు.. అత్యంత శక్తిమంత ప్రయాణమిది' అని క్యాప్షన్‌తో దీనిపై పోస్ట్ పెట్టారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం సాయిదుర్గా తేజ్ 'ఎస్.వై.జి' (సంబరాల ఏటి గట్టు)తో బిజీగా ఉన్నారు. ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. రోహిత్. కె.పి. దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. దీనిపై ఇటీవల ఈ హీరో మాట్లాడుతూ.. '''బ్రో' తర్వాత ఖరారైన నా రెండు సినిమాలు ఆగిపోయాయి. ఆ తర్వాత ఇందులో నటించే అవకాశం వచ్చింది. ఈ సినిమా కోసం నా సర్వస్వం ధారపోస్తూ... శాయశక్తులా కష్టపడుతున్నా. మంచి బృందంతో కలిసి చేస్తున్న ఈ సినిమా నా కెరీర్‌లో ఒక అద్భుతంలా నిలిచిపోతుంది'' అని అన్నారు.



# ఆ చిన్న చిన్న అలవాట్లే నన్ను నిలబెడుతున్నాయి

ఒకవైపు వరుస సినిమాల్లో అలరిస్తూనే మరోవైపు డాక్టర్ పట్టా అందుకున్నారు నటి శ్రీలీల. వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిని బ్యాలెన్స్ చేసుకోవడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''పాత్రలో లీనమవడం ఎంత ముఖ్యమో, దానినుంచి బయటకు రావడం కూడా అంతే ముఖ్యం. షూటింగ్ ఒత్తిడి నుంచి బయటపడటానికి నేను కొన్ని చిన్నచిన్న అలవాట్లను చేసుకున్నాను. సంగీతం వినడం, కాసేపు ఒంటరిగా గడపడం, కుటుంబసభ్యులతో వీడియో కాల్‌లో మాట్లాడటం వంటివి నాకు ఉపశమనాన్ని ఇస్తాయి. ఫ్రెండ్స్‌తో చిట్‌చాట్ చేయడం నాకు రిలీఫ్‌గా ఉంటుంది. నేను పని ఒత్తిడిని ఇంటికి తీసుకెళ్లకూడదని ప్రయత్నిస్తాను. ఒకవేళ పొరపాటున అలా జరిగినా, పైన చెప్పిన చిన్న చిన్న పద్ధతులు నన్ను మళ్లీ మామూలు స్థితికి తీసుకువస్తాయి. కొన్నిసార్లు పరిస్థితులకు అనుగుణంగా మనల్ని మనం సర్దుబాటు చేసుకుంటూ ముందుకుసాగడమే ఏకైక మార్గం'' అని శ్రీలీల తెలిపారు.
ప్రస్తుతం శ్రీలీల కోలీవుడ్‌లో బిజీగా మారింది. 'పరాశక్తి'తో తమిళనాట అడుగుపెట్టిన ఆమె ధనుష్‌తో కలిసి 'డీ55' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తోంది. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో ఇది రానుంది. దీనితో పాటు అనురాగ్ బసు దర్శకత్వంలో బాలీవుడ్ ఎంట్రీకి కూడా శ్రీలీల సిద్ధమవుతున్నారు.



# యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో బంపర్ ఆఫర్ కొట్టేసిన శార్వరి వాఘ్..

బాలీవుడ్ యంగ్ బ్యూటీ శార్వరి వాఘ్ ప్రస్తుతం వరుస ఆఫర్లతో ఫుల్ జోష్‌లో ఉంది. ఇప్పటికే తన నటనతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ, తాజాగా, యష్‌రాజ్ ఫిల్మ్స్ (YRF) బ్యానర్‌లో మరో బంపర్ ఆఫర్ కొట్టేసింది. 'సైయారా' చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న యంగ్ హీరో అహాన్ పాండే సరసన శార్వరి జోడీగా నటించబోతున్నట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. యష్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 79వ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు సమాచారం. ఈ రొమాంటిక్ యాక్షన్ డ్రామాను టాలెంటెడ్ డైరెక్టర్ అలీ అబ్బాస్ జాఫర్ ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం.. ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ నేటి నుంచే ప్రారంభమైందని తెలుస్తోంది. అహాన్ పాండే, శార్వరి వాఘ్ లీడ్ రోల్స్‌లో వస్తున్న ఈ సినిమాపై బాలీవుడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోవైపు, శార్వరి వాఘ్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చిత్రం 'అల్ఫా' విడుదలకు సిద్ధమవుతోంది.
యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ప్రధాన పాత్రలో కనిపిస్తుండగా, శార్వరి మరో కీలక పాత్రలో నటిస్తోంది. శివ్ రావైల్ దర్శకత్వంలో వస్తున్న ఈ హైవోల్టేజ్ యాక్షన్ మూవీలో అనిల్ కపూర్, బాబీ డియోల్ వంటి హేమాహేమీలు నటిస్తుండటం విశేషం. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా సాగుతోంది. గ్లామర్‌తో పాటు సాలిడ్ యాక్షన్ సీక్వెన్స్‌లు ఈ చిత్రంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయట. 'అల్ఫా' చిత్రం జులై 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఇలా ఒకేసారి భారీ బడ్జెట్ సినిమాల్లో భాగమవుతూ, యష్ రాజ్ ఫిల్మ్స్ వంటి పెద్ద బ్యానర్లలో వరుస అవకాశాలు అందుకుంటూ శార్వరి తన కెరీర్ గ్రాఫ్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తోంది. ఆలియాతో స్పై ఆపరేషన్, అహాన్ పాండేతో రొమాన్స్.. ఇలా శార్వరి వాఘ్ రూట్ చూస్తుంటే బాలీవుడ్‌లో ఈమె హవా గట్టిగానే నడిచేలా కనిపిస్తోంది.




# సముద్రఖనికి మరో సక్సెస్.. 'కార్మేని సెల్వం' ఎలా ఉందంటే?


సముద్రఖని, లక్ష్మీ ప్రియా జంటగా నటించిన చిత్రం కార్మేని సెల్వం. ఇందులో గౌతమ్ వాసుదేవ్ మీనన్, అభినయ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో విడుదలైన ఈ చిత్రం కంప్లీట్ క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మించిన ఈ చిత్రానికి రామ్ చక్రి దర్శకత్వం వహించారు. ఈరోజు విడుదలైన ఈ సినిమాకు ఫ్యామిలీ ఆడియన్స్ నుండి మంచి రెస్పాన్స్ లభిస్తోంది.

**కథ విషయానికి వస్తే...**

ఈ సినిమాలో సముద్రఖని, లక్ష్మీ ప్రియా దంపతులుగా నటించారు. వీరిద్దరూ ఎంతో కష్టపడుతూ కుటుంబాన్ని ముందుకు సాగిస్తూ ఉంటారు. ఒక మంచి ఇల్లు కట్టుకోవడం, ఒక కారు కొనుగోలు చేయడం వీరి పెద్ద కోరికగా ఉంటుంది. దాని కోసం రూపాయి రూపాయి పోగు చేస్తూ జీవితాన్ని నెట్టుకొస్తారు.అయితే ఒక ఫ్యామిలీ ఫంక్షన్‌లో సముద్రఖని, లక్ష్మీ ప్రియాకి బంధువుల ద్వారా అవమానాలు ఎదురవుతాయి. ఆ అవమానాన్ని మర్చిపోలేక పెద్ద ఎత్తున డబ్బు సంపాదించాలని సముద్రఖని ప్రయత్నాలను మొదలు పెడతాడు. అయితే ఆ ప్రయత్నాల వల్ల అతను భారీగా అప్పుల పాలవుతాడు. ఆ తర్వాత అతని జీవితం ఎలాంటి మలుపులు తీసుకుంది? చివరకు వారి కుటుంబ పరిస్థితి ఎలా మారింది? అనే విషయాలు వెండితెరపై చూడాల్సిందే.

**విశ్లేషణ:**

ఈ సినిమాలో దర్శకుడు తీసుకున్న పాయింట్ చాలా చిన్నదైనా, దానిని సాధారణ మిడిల్ క్లాస్ కుటుంబాలకు దగ్గరగా అనిపించేలా తెరకెక్కించాడు. ఇందులో ప్రధాన పాత్రల్లో నటించిన సముద్రఖని, లక్ష్మీ ప్రియా తమ నటనతో మంచి ప్రశంసలు అందుకుంటున్నారు. ఓవరాల్‌గా చూస్తే, 'కార్మేని సెల్వం' సినిమా మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.



# ఆ ఒక్కటీ చేసుంటే నెక్స్ట్ లెవల్!

సినిమా బాగుంటే జనం వస్తారు. వాళ్లే ఆదరిస్తారు అనేది పాత మాట. సినిమా బాగుందని జనానికి తెలిసేలా ప్రమోషన్లు చేయాలి.. అనేదే ఇప్పటి ట్రెండ్. తాజాగా విడుదలైన 'బైకర్' సినిమా విషయంలో యూనిట్ చేసిన అతిపెద్ద తప్పు ఇదేనని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ఒక మంచి కంటెంట్ ఉన్న సినిమాకు కావాల్సిన కనీస స్థాయి ప్రమోషన్లను కూడా ఈ టీమ్ నిర్వహించకపోవడం చర్చనీయాంశంగా మారింది. శర్వానంద్ గత చిత్రం నారీ నారీ నడుమ మురారి భారీ హిట్ అయింది ఆ సినిమాకి శర్వ ముందు నుంచి మంచి ప్రమోషన్స్ చేశాడు. కానీ ఈ సినిమా విషయంలో ఎందుకో దాన్ని ప్రమోట్ చేసినంత చేయలేక పోయాడు. ఏ పెద్ద సినిమాకైనా, చిన్న సినిమాకైనా విడుదలకు ముందు వచ్చే 'హైప్' అనేది చాలా ముఖ్యం. అడ్వాన్స్ బుకింగ్స్ ఒక రేంజ్‌లో ఉండాలంటే టీజర్, ట్రైలర్‌తో పాటు ఆడియన్స్‌తో కనెక్ట్ అయ్యేలా ఈవెంట్స్ చేయాలి. కానీ 'బైకర్' టీమ్ మాత్రం కనీసం ఒక గ్రాండ్ ఈవెంట్ నిర్వహించి హైప్ పెంచే ప్రయత్నం చేయలేదు. విడుదల వారంలో హీరో మీడియా ముందుకు వచ్చి సినిమా గురించి ముచ్చటించిన దాఖలాలు లేవు. ప్రమోషన్లు లేకపోవడంతో సామాన్య ప్రేక్షకులకు ఈ సినిమా రిలీజ్ అవుతున్న విషయమే సరిగ్గా తెలియలేదు, దీనివల్ల అడ్వాన్స్ బుకింగ్స్ ఘోరంగా దెబ్బతిన్నాయి. సినిమా చూసిన ప్రేక్షకుల నుండి అందుతున్న సమాచారం ప్రకారం.. 'బైకర్' కంటెంట్ పరంగా చాలా బాగుంది, షో షోకి మౌత్ టాక్ పెరుగుతోంది. అయితే, ముందే సరైన పబ్లిసిటీ ఉండి ఉంటే.. ఓపెనింగ్స్ అదిరిపోయే రేంజ్‌లో ఉండేవని ట్రేడ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు, మంచి కలెక్షన్లతో మొదలవ్వాల్సిన సినిమా, ఇప్పుడు కేవలం 'మౌత్ టాక్' మీద ఆధారపడి నెమ్మదిగా పుంజుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది కాబట్టి, ఇకనైనా యూనిట్ దూకుడు పెంచి సోషల్ మీడియాలో వస్తున్న మంచి రివ్యూలను, ప్రేక్షకుల రెస్పాన్స్‌ను భారీగా ప్రమోట్ చేయాలి.




# ఎన్టీఆర్‌ను ఢీ కొట్టేదెవరు?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న హైవోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్. ఈ ప్రాజెక్ట్ నుండి విలన్‌గా నటిస్తాడనుకున్న మలయాళ స్టార్ నటుడు టోవినో థామస్ తప్పుకోవడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రశాంత్ నీల్ సినిమాల్లో హీరో పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో విలన్ రోల్ కూడా అంతే ధీటుగా ఉంటుంది. ఈ క్రమంలోనే ఎన్టీఆర్‌తో మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ ఢీ కొట్టబోతున్నాడని తెలియడంతో ఈ ఇద్దరి మధ్య యాక్షన్ మామూలుగా ఉండదని అనుకున్నారు.
కానీ టొవినో ఈ ప్రాజెక్ట్ నుండి తప్పుకున్నట్లు స్వయంగా వెల్లడించారు. ఇతర సినిమాల కారణంగా డేట్స్ అడ్జస్ట్‌మెంట్ కుదరకపోవడం వల్లే ఈ భారీ చిత్రాన్ని వదులుకోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. అయితే ఇప్పటికే డ్రాగన్ షూటింగ్ జెట్ స్పీడ్‌లో జరుగుతోంది. దాదాపుగా 40 శాతం షూటింగ్ కంప్లీట్ అయింది. మరి ఇప్పటి వరకు విలన్ డ్రాగన్ సెట్స్‌లో అడుగుపెట్టలేదా? అంటే క్లారిటీ లేకుండా పోయింది. అసలు ఇప్పటి వరకు కొత్త విలన్ విషయంలో ఎలాంటి లీకేజీ బయటికి రాలేదు. దీంతో.. ఎన్టీఆర్ విలన్ ఫిక్స్ అయ్యాడా? లేదా? అనేది తెలియాల్సి ఉంది. అసలు ప్రశాంత్ నీల్ ఎన్టీఆర్ కోసం ఎవరిని రంగంలోకి దింపుతున్నాడు? టొవినో రేంజ్ నటుడిని తీసుకొస్తారా? అనేది మరింత ఆసక్తికరంగా మారింది. మరి ఎన్టీఆర్ వంటి మాస్ హీరోని ఢీకొట్టే ఆ స్టార్ ఎవరో చూడాలి. మరోవైపు ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న రుక్మిణి వసంత్ విషయంలోను అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# మే నుండి స్టార్ట్ కానున్న కిరణ్ అబ్బవరం 'రియాలిటీ'

టాలీవుడ్ యువ నటుడు కిరణ్ అబ్బవరం ఇప్పటికే ఎన్నో చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకున్నాడు. ఈయన ఇప్పటికే నిర్మాతగా కూడా మారారు. 'తిమ్మరాజుపల్లి టీవీ' అనే చిత్రాన్ని నిర్మించాడు. ఈ మూవీని ఏప్రిల్ 17వ తేదీన విడుదల చేయనున్నారు. ఇలా ఇప్పటికే నటుడిగా, నిర్మాతగా బిజీగా ఉన్న ఈ యువ హీరో మరికొన్ని రోజుల్లో దర్శకుడిగా కూడా ఓ సినిమాను రూపొందించబోతున్నాడు. ఈ యువ నటుడు 'రియాలిటీ' అనే టైటిల్‌తో ఓ సినిమాను రూపొందించడానికి రెడీ అయ్యాడు.
ఈ మూవీకి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్‌ను మే నెల నుండి ప్రారంభించబోతున్నట్టు తెలుస్తోంది. ఇక దీపావళి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలనే ఆలోచనలో కిరణ్ అబ్బవరం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఈయన 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా ప్రచారాలలో చాలా యాక్టివ్‌గా పాల్గొంటున్నారు. ఈ సినిమా నుండి విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడంతో ఈ మూవీపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఈ సినిమా మంచి విజయం సాధిస్తే కిరణ్ అబ్బవరంకు నిర్మాతగా కూడా మంచి గుర్తింపు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

